క్లుప్తంగా

పోలింగ్ రోజు పరీక్షలను వాయిదా వేయాలి



బాన్సువాడ రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల రోజు నిర్వహించే ఎస్‌బీఐ క్లర్క్ పరీక్షను వాయిదా వేయాలని బీసీ సంఘం రాష్ట్ర యువజన కార్యదర్శి, పుట్ట భాస్కర్ డిమాండ్ చేశారు. పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొనే అవకాశం జారవిడుచుకోకుండా ఉండాలంటే ఎన్నికల కమిషన్ కల్పించుకుని పరీక్షను వాయిదా వేయాలని కోరారు. ఒకవేళ పరీక్షను యథాతథంగా నిర్వహిస్తే ప్రజాస్వామ్య బద్ధంగా లభించిన ఓటుహక్కును వినియోగించుకోలేకపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే ఎన్నికల కమిషన్ స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గ్రాడ్యుయేట్ అభ్యర్థులు సైతం స్పందించి సమస్యను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

మాదిగల ఐక్యవేదిక ఏర్పాటు



మాచారెడ్డి: మాచారెడ్డి, పాల్వంచ మండలాల మాదిగ ఐక్యవేదిక నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఐక్యవేదిక అధ్యక్షుడిగా పొదార్ల రాంచంద్రం, ప్రధాన కార్యదర్శిగా పొదార్ల సత్యం, గౌరవ అధ్యక్షులుగా లక్ష్మీరాజం, కాశీరాం, ఉపాధ్యక్షులుగా కొలాపురం బాబు, బట్టు నరేశ్, సతీష్‌బాబు, నాగరాజు, ముఖ్య సలహాదారుగా బట్ట వెంకటరాములు, కోశాధికారిగా రమేశ్, దేవయ్య, కార్యదర్శులుగా విష్ణు, భూమేశ్, రాజెల్లం, ప్రవీణ్, అల్లం కిషన్, గ్యార కిషన్, బొట్ల రాజేందర్, దయానంద్‌లను ఎన్నుకున్నారు.

తలసేమియా వ్యాధి బాధితులకు రక్తదానం



కామారెడ్డి అర్బన్: తలసేమియా వ్యాధితో బాధపడుతున్న ఇద్దరు చిన్నారులు శ్రీనివాస్ నాయక్, వెంకటేష్ నాయక్‌లకు ప్రతినెలా రెండు యూనిట్ల బి–పాజిటివ్ రక్తం అవసరం కాగా ఆదివారం అందజేసినట్టు ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త ఎన్. బాలు తెలిపారు. తలసేమియా వ్యాధితో బాధపడే వారికి ప్రతి 20 రోజులకు ఒకసారి రక్తం ఎక్కించాల్సి ఉంటున్నందున యువకులు రక్తదానం చేయడానికి ముందుకు రావాలని బాలు విజ్ఞప్తి చేశారు.

'గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసుకుందాం'



తాడ్వాయి(ఎల్లారెడ్డి): కృష్ణాజీవాడిలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించుకొని గ్రామస్తులు ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు మోహన్‌రెడ్డి, నరహరి మాట్లాడుతూ.. గ్రామంలో యువకులు, విద్యార్థులకు గ్రంథాలయం చాలా అవసరమన్నారు. పలు ఉద్యోగాలు, పోటీ పరీక్షలకు కోచింగ్‌కు వెళ్లలేని వారు ఈ గ్రంథాలయంలో ప్రశాంతమైన వాతవరణంలో చదువుకోవచ్చన్నారు. గ్రామస్తులు అందరూ కలసి తమవంతుగా సహాయ సహకారాలు అందించి త్వరలోనే గ్రామంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసుకుంటామన్నారు.

గురుకుల పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలి



బాన్సువాడ రూరల్: గురుకుల విద్యాసంస్థలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఏఎస్‌ఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు మోరిల్ శ్రీనివాస్‌రావు అన్నారు. ఆదివారం ఏఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని సాయికీర్తి జూనియర్ కళాశాలలో వీజీసెట్–2025 మోడల్ పరీక్ష నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులు సమయాన్ని వృథాచేయకుండా శ్రద్ధతో, ఏకాగ్రతతో చదివి పరీక్ష రాయాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఇంటి వద్ద కూడా చదువుకునేలా వాతావరణం కల్పించాలని, టీవీలు, స్మార్ట్‌ఫోన్‌లకు దూరంగా ఉంచాలన్నారు. ఏఎస్‌ఆర్ ఫౌండేషన్ ద్వారా అయ్యాల సంతోష్ చేస్తున్న సేవలను ఆయన కొనియాడారు. మోడల్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెమొంటోలతో సత్కరించారు. అయ్యాల సంతో ష్, కల్లూరి రాజారాం, సాయిలు, పర్వయ్య, నాగరాజు, మన్నె సాయిలు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు ఇలా.. ఆడుకునేదెలా?



బుడిమి ఉన్నత పాఠశాల చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు

బాన్సువాడ రూరల్: బుడిమి జెడ్పీహైస్కూల్ ఆవరణ పిచ్చిమొక్కలతో నిండిపోయింది. విద్యార్థులు ఉదయం, సాయంత్రం ఆడుకోవడానికి వీలులేకుండా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేయించే వారు కరువయ్యారు. దీంతో పాములు, తేళ్లు ఇతర విషకీటకాలు వచ్చి విద్యార్థులకు హాని కల్గించే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

స్తంభం అమర్చారు.. తీగలు మరిచారు



నాగారంలో వృథాగా ఉన్న కొత్త స్తంభం

బాన్సువాడ రూరల్: మండలంలోని నాగారంలో ప్రధాన రహదారిపై విద్యుత్ స్తంభం శిథిలావస్థకు చేరడంతో దాని పక్కనే కొత్త స్తంభం అమర్చారు. అమర్చి నెలలు గడుస్తున్నా పాతస్తంభానికి ఉన్న తీగలను, కొత్త స్తంభానికి అమర్చడం లేదు. దీంతో పాతస్తంభం ఎప్పుడు కూలిపోతుందోనని గ్రామస్తులు భయాందోళనకు గురువుతున్నారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి కొత్తస్తంభాన్ని వినియోగంలోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిర్మించారు.. వదిలేశారు..!



చుట్టూ పిచ్చి మొక్కలతో నిండి షట్టర్ లేకుండా నిరుపయోగంగా ఉన్న గోడౌన్

బాన్సువాడ రూరల్: ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో చేపట్టే ప్రతి నిర్మాణం ప్రజలకు ఉపయోగకరంగా ఉండాలి. కాని మండలంలోని కాద్లాపూర్‌లో మాత్రం రూ.5 లక్షల నిధులతో నిర్మించిన గోడౌన్ కేవలం కాంట్రాక్టర్ జేబులు నింపడానికే నిర్మించినట్లుగా కన్పిస్తోంది. గోడౌన్‌కు షట్టర్, దారి ఏర్పాటు చేయకుండా అసంపూర్తిగా వదిలేశారు. దీంతో నిర్మాణం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి నిరుపయోగంగా మారింది. గోడౌన్ నిర్మాణం పూర్తయితే ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలు అందుబాటులో ఉంచడానికి ఉపయోగకరంగా మారుతుందని భావించిన గ్రామస్తులకు నిరాశే మిగిలింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోడౌన్‌ను ఉపయోగంలోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

శిలాఫలకానికే పరిమితం

- ముందుకు పడని గాలీపూర్–కొమలంచ వంతెన పనులు
- పట్టించుకోని అధికారులు



ఏర్పాటు చేసిన శిలాఫలకం



గాలీపూర్ - కొమలంచ మధ్య వాగుపై వంతెన నిర్మించాల్సిన ప్రదేశం

నిజాంసాగర్(జుక్కల్): దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా మారింది హైలెవల్ వంతెన నిర్మాణం పరిస్థితి. ప్రభుత్వం కేవలం మాటకు రూ.కోటి నిధులు మంజూరు చేశామని చెప్పడమే గానీ తర్వాత టెండర్ పనులు, వంతెనకు సంబంధించిన మిగతా పేపర్ వర్క్ పనులు అడుగు దూరం కూడా పడలేదు. గత ప్రభుత్వం వంతెన నిర్మాణానికి రూ. కోటి చేశామని చెప్పి ఏడాదిన్నర కిందట శిలాఫలకం ఆవిష్కరించారు. కాని ఇంత వరకు వంతెన నిర్మాణ పనులు జాడ లేకపోవడంతో రైతుల బాధలు వర్ణణాతీతంగా మారాయి. మహమ్మద్ నగర్ మండలంలోని గాలీపూర్– కొమలంచ గ్రామాల మధ్య పంట పొలాలకు వెళ్లే దారిలో ఉన్న వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణం కోసం గత ప్రభుత్వం రూ. కోటి మంజూరు చేసింది. ఆయా గ్రామాల మధ్య 450 ఎకరాల భూముల్లో రైతులు పంటలు పండిస్తున్నారు. పంటపొలాల నుంచి వచ్చే నీళ్లతో పాటు నిజాంసాగర్ ప్రధాన కాలువ డిస్ట్రిబ్యూటరీ నీళ్లు వాగులో ప్రవహిస్తున్నాయి. వర్షాకాలంలో వాగు దాటి వెళ్లేందుకు గాలిపూర్, ముగ్దుంపూర్, కొమలంచ గ్రామాల రైతులు, ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. వాగులో నీటి ప్రవాహం కారణంగా ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్లు వెళ్లలేని పరిస్థితులుంటాయి. వాగుపైన వంతెనను నిర్మించాలని ఇరు గ్రామాల రైతులు అప్పట్లో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధేకు పలు మార్లు విన్నవించారు. దాంతో అసెంబ్లీ ఎన్నికల ముందు వంతెన నిర్మాణానికి అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వంతెన నిర్మాణానికి ఆఘమేఘాల మీద అప్పటి ప్రభుత్వ పాలకులు శిలాఫకలం వేసి శంకుస్థాపన చేశారు. వంతెన నిర్మాణానికి నిధులు వచ్చాయని, శంకుస్థాపన చేశారని ఇరు గ్రామాల రైతులు సంతోషించారు. కాని ఇంత వరకు వంతెన నిర్మాణం జాడ కరువైంది. వంతెన నిర్మాణ పనుల విషయాన్ని సంబంధిత శాఖాధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. దాంతో గాలీపూర్‌లో వేసిన శిలాఫకలం ఇరు గ్రామాల ప్రజలు, రైతులను వెక్కిరిస్తోంది. అధికారులు ఇకనైనా స్పందించి వంతెన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టాలని స్థానిక రైతులు, ప్రజలు కోరుతున్నారు.

త్వరగా నిర్మించాలి



వందలాది ఎకరాల పంట పొలాలకు రహదారిగా ఉన్న వాగుపై వంతెన నిర్మాణం త్వరగా చేపట్టాలి. పంట పొలాలకు ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు వెళ్లడం కష్టంగా మారింది. దాంతో పంటలకు మందు సంచులు తీసుకు వెళ్లడం, వరిధాన్యం ఇళ్లకు తీసుకు రావడం చానా ఇబ్బందిగా ఉంది.

– ఆదం రాజు, గాలిపూర్ గ్రామస్తుడు

బ్లాక్ మార్కెట్‌కు నిరుపేదల చక్కెర

- అంత్యోదయ కార్డులకు రెండేళ్లుగా చక్కెర పంపిణీ చేయని రేషన్ డీలర్లు
- అధికారుల పర్యవేక్షణ కరువు

రామారెడ్డి: అంత్యోదయ కార్డులపై నెలనెలా 35 కిలోల బియ్యంతో పాటు కిలో చక్కెర ఇవ్వాల్సి ఉంటుంది. రేషన్ డీలర్లు ఎన్ని అంత్యోదయ కార్డులు ఉంటే అన్నికిలోలకు (కిలోకు రూ.13.30 పైసలు చొప్పున) డీడీల రూపంలో చెల్లించాలి. కానీ రెండు సంవత్సరాలుగా రేషన్ డీలర్లు అంత్యోదయ కార్డులకు చక్కెరకు సంబంధించి డీడీలు కట్టడం లేదనే సాకుతో లబ్ధిదారులకు చక్కెర ఇవ్వడం లేదు. జిల్లాలో 577 రేషన్ షాపులు, 901 అంత్యోదయ కార్డులు ఉన్నాయి. కొన్నిచోట్ల లబ్ధిదారులకు చక్కెర పంపిణీ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. కానీ 90% పైగా డీడీలు కట్టి లబ్ధిదారులకు ఇవ్వకుండా బ్లాక్ మార్కెట్కు తరలిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ–పాస్ మిషన్లో చక్కెర కూడా పంపిణీ చేసినట్లు చూపిస్తుందని లబ్ధిదారులు చెబున్నారు.

రెండేళ్ల నుంచి ఇస్తలేరు

బియ్యం మాత్రమే ఇస్తున్నారు. రెండేళ్ల కింద చక్కెరి ఇచ్చింర్రు. చక్కర వస్తలేదని చెప్పుర్రు.

– భవానిపేట సుగుణ, అంత్యోదయకార్డు లబ్ధిదారు

చర్యలు తీసుకుంటాం

లబ్ధిదారులకు ప్రభు త్వం అందిస్తున్న సరుకులను కచ్చితంగా అందించాలి.సరుకులు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటాం. – రాజేందర్, సివిల్ సప్లై జిల్లా మేనేజర్

పట్టపగలే వెలుగుతున్న లైట్లు



ఎల్లారెడ్డి: మున్సిపాలిటీ పరిధిలోని బాలాజీ నగర్ తండాలో పట్టపగలు హైమాస్ట్ లైట్లు వెలుగుతున్నా వాటిని ఆఫ్ చేసే వారు కరువయ్యారు. మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల 24 గంటలూ లైట్లు వెలుగుతున్నాయని స్థానిక చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమయానికి ఆన్ చేసి ఆఫ్ చేసేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

మానవత్వం చాటుకున్న మున్సిపల్ మాజీ చైర్మన్



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ మానవత్వం చాటుకున్నారు. ఆదివారం గాంధారి నుంచి ఎల్లారెడ్డికి వస్తుండగా గండివేట శివారులో రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడిని పరామర్శించి తన వాహనంలో ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించేలా చర్యలు తీసుకున్నారు.

వన్య ప్రాణులకు తప్పని నీటి తిప్పలు



నీటి ప్యాకెట్‌తో దాహం తీర్చుకుంటున్న వానరం

రామారెడ్డి: వేసవి ప్రారంభంలోనే చెరువులు అడుగంటుతున్నాయి. బోరు బావులు ఎత్తిపోస్తున్నాయి. తాగునీటికి తిప్పలు అప్పుడే ప్రారంభమయ్యాయి. వన్యప్రాణులకు తాగునీటి తిప్పలు తప్పడం లేదు.

రామారెడ్డి గ్రామంలో ఆదివారం ఓ వానరం వాటర్ ప్యాకెట్‌ను షాపులోంచి ఎత్తుకొచ్చి చింపి తాగునీటి దాహం తీర్చుకుంది. ఈ దృశ్యం సాక్షి కెమెరాకు చిక్కింది. అధికారులు వన్యప్రాణుల కోసం ప్రత్యేకంగా తాగు నీటి వసతి కల్పిస్తే బాగుంటుందని స్థానికులు అంటున్నారు. నీళ్ల కోసం ఇళ్లలోకి కోతులు వచ్చి నానా బీభత్సం చేస్తున్నాయని వారు వాపోతున్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా సహస్ర ఘటాభిషేకం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఉత్తునూర్‌లో ఖండేరాయ మహదేవుడి వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం సహస్ర ఘటాభిషేకం, మంటప పూజ, ముఖ్య దేవతా పూజ, హవనము, బోనాల ఊరేగింపు, ఒగ్గుకథ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ దొడ్లె రవి, వీడీసీ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు. వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం ఖండేరాయ మహదేవుడు, మాండకమ్మ కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ దొడ్లె రవి తెలిపారు.

పోచమ్మ తల్లికి బోనాల ఊరేగింపు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో రేణుకా ఎల్లమ్మ ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం పోచమ్మ తల్లికి బోనాలను ఊరేగించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గౌడ సంఘం ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం రేణుకా జమదగ్ని కల్యాణ వేడుకలను నిర్వహించనున్నట్లు గౌడ సంఘం ప్రతినిధులు తెలిపారు.

కొనసాగుతున్న అంబరీశ్వర ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని భూంపల్లి గ్రామ స్టేజీ వద్ద గల అంబరీశ్వర ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా భక్తులకు ఆదివారం అన్నదానం నిర్వహించారు. ప్రత్యేక పూజలు జరిగాయి.ఆలయ కమిటీ చైర్మన్ రాజిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా జ్యోతిర్లింగాల మహాపడిపూజ



కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని కల్కినగర్ కాలనీలో అంబీర్ రాజేందర్‌రావు పద్మ దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం మహాపడి పూజోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో శివస్వాములు జమాల్‌పూర్ భూజంగరావు, పెద్దొళ్ల శశిధర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

దేవునిపల్లి శివాలయంలో పూజలు



కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి శివాలయంలో అర్చకులు శశికాంత్, శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహారాజ పోషకుల ఆధ్వర్యంలో శివస్వాములకు భిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శివ భిక్ష కమిటీ అధ్యక్షుడు నిట్టు నారాయణరావు, ప్రతినిధులు లద్దూరి లక్ష్మీపతియాదవ్, తన్నీరు శేఖర్, చిన్నోళ్ల గోపాల్‌రావు, కుసుమ రాజారాం తదితరులు పాల్గొన్నారు.

సరంపల్లిలో సత్యసాయి బాలవికాస్



కామారెడ్డిఅర్బన్: శ్రీసత్యసాయి సేవా సమితి కామారెడ్డి సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ పరిధిలోని సరంపల్లి ప్రాథమిక పాఠశాల వద్ద సత్యసాయి బాలవికాస్ ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు. సేవా సమితి ప్రతినిధి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పిల్లల్లో ఆధ్యాత్మిక భావన, పెద్దలు, అతిథులను గౌరవించడం, చదువు, సంస్కారం గురించి వివరించినట్టు పేర్కొన్నారు.

సంకష్టహర చతుర్థి పూజల్లో మాజీ ఎమ్మెల్యే



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం కేంద్రంలోని శ్రీ రామ మందిరంలో ఆదివారం ద్విజప్రియ సంకష్ట హర చతుర్థి పూజల్లో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంతు సింధే కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణం చేసి అన్నప్రసాదం స్వీకరించారు. నాయకులు భానుగౌడ్ తదితరులున్నారు.

ఘనంగా ఎల్లమ్మకు బోనాలు



దోమకొండ: ముత్యంపేటలో ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా ఎల్లమ్మకు బోనాలు తీశారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఇంటి నుంచి ఎల్లమ్మకు డప్పుచప్పుళ్ల మధ్య బోనాలను తీశారు. అనంతరం అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. సాయంత్రం స్వామివారి శావ ఊరేగింపు నిర్వహించారు. గౌడ సంఘం ప్రతినిధులు కేపీ రామాగౌడ్, లక్ష్మీనారాయగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పూజలు

మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేలాది మంది వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. మాచారెడ్డి ఎస్సై అనిల్ దంపతులు, స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ ఈవో శ్రీధర్‌రావ్, జూనియర్ అసిస్టెంట్ సంతోష్‌కుమార్‌లు వారికి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించి సత్కరించారు. చైర్మన్ కమలాకర్ రెడ్డి, అర్చకులు తదితరులున్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న సీడీసీ చైర్మన్ ఇర్షాదొద్దీన్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): సీడీసీ భవన నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని కోరుతూ ఆదివారం సీడీసీ చైర్మన్ ఇర్షాదొద్దిన్, ఎమ్మెల్యే మదన్ మోహన్ రావును కలిసి వినతి పత్రం అందజేశారు. భవన నిర్మాణం కోసం వెయ్యి గజాల స్థలం, రూ.20 లక్షలు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు. విండో చైర్మన్లు సదాశివరెడ్డి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

19 నుంచి ఉమామహేశ్వర ఆలయ ప్రారంభ వేడుకలు

భిక్కనూరు: బస్వాపూర్‌లో ఉమామహేశ్వర స్వామి దేవాలయ ప్రారంభ వేడుకలను ఈ నెల 19 నుంచి 21 వరకు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధ్యక్షుడు మద్ది లింగం ఆదివారం తెలిపారు. భక్తులు కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.


నేడు నీలకంఠేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం

కామారెడ్డి అర్బన్: పట్టణంలోని శివనగర్ కాలనీ శ్రీమంగళగౌరి నీలకంఠేశ్వర స్వామి ఆలయ 9వ వార్షికోత్సవం, ఏకశిల రాతిధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమం నేడు(సోమవారం) నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు చింత సుదర్శన్, అజ్జ సిద్ధిరాములు, వి.రమేష్, రాజమౌళి, జానకిరాములు తెలిపారు. భక్తులు హాజరై విజయవంతం చేయాలని ప్రతినిధులు కోరారు.

సర్వేలో పాల్గొనని వారు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలి

ఎల్లారెడ్డిరూరల్: సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొనని వారు ఆన్‌లైన్ పోర్టల్ నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఎంపీవో ప్రకాష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 నుంచి 28 వరకు సర్వే రెండో విడత నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలను నమోదు చేసి ప్రజాపాలన సేవా కేంద్రంలో అందించాలని అన్నారు. సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించిన మరిన్ని వివరాలను తెలుసుకునేందుకు 040-211111111 నెంబరుకు ఫోన్ చేసి కనుక్కోవాలని అన్నారు.

మూలన పడ్డ చెత్త రిక్షాలు



బీబీపేట: పల్లెల్లో పారిశుద్ధ్యం లోపించకుండా ఉండడానికి గత ప్రభుత్వం చెత్త తీసుకుపోవడానికి చెత్త రిక్షాలను ప్రతి గ్రామ పంచాయతీకి కేటాయించింది. కానీ అవి ప్రస్తుతం వాడుకలో లేకపోవడంతో ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో మూలన పడేశారు. వాటి స్థానంలో ట్రాక్టర్లను వినియోగించడంతో చెత్త రిక్షాలను పట్టించుకోవడం లేదు. ట్రాక్టర్లను వినియోగించడం వల్ల ఖర్చులు భారీగా గ్రామ పంచాయతీ మీద పడుతున్నాయి. అప్పట్లో ఒక్కో గ్రామ పంచాయతీకి 2 నుంచి 5 వరకు చెత్త రిక్షాలను ప్రభుత్వం కేటాయించింది. పారిశుద్ధ్య కార్మికులు గ్రామాల్లో ప్రతి వీధి తిరుగుతూ చెత్తను సేకరించేవారు. రిక్షాలు ఇప్పుడు ఎవరూ వినియోగించకపోవడంతో వృథాగా పడి ఉండడం వల్ల కోట్ల ప్రజాధనం వృథా చేశారు అనే విమర్శలు వస్తున్నాయి. చిన్న చిన్న పనులకు వాటిని వినియోగించుకుంటే జీపీల మీదు ఖర్చు భారం తగ్గుతుందని స్థానికులు చెబుతున్నారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు తనిఖీ

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని అచ్చంపేట ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ సైన్స్ ప్రాక్టికల్ పరీక్షను ఆదివారం జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం తనిఖీ చేశారు. ఈ నెల 13 నుంచి సీసీ కెమెరాల నిఘా మధ్యన ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతున్నాయన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ కార్తీక సంధ్య, తదితరులు ఉన్నారు.